సాక్షి
పెద్దపల్లి
గురువారం । 13 । మార్చి । 2025



విద్యార్థుల అభ్యసన తీరు పరిశీలన
పెద్దపల్లిరూరల్/మంథని: రాఘవాపూర్, మంథని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను విద్యామండలి రీసెర్చ్, శిక్షణ సంస్థ సభ్యులు గణపతిశర్మ, జగన్‌మోహన్ పరిశీలించారు.



ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక
పెద్దపల్లిరూరల్: వీ హబ్, డీఆర్డీవో సంయుక్తంగా నిర్వహించిన ఐడియేషన్ బూట్‌క్యాంప్ ఇంటర్న్‌షిప్‌కు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు నిఖిత, నవ్య ఎంపికయ్యారు.



	ఇఫ్తార్ గురువారం (సా॥)	సహర్ శుక్రవారం (ఉ॥)
కరీంనగర్	6.28	5.06
పెద్దపల్లి	6.31	5.04
సిరిసిల్ల	6.26	5.14
జగిత్యాల	6.31	5.04

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డీసీపీ



కలెక్టర్ శ్రీహర్షతో డీసీపీ కరుణాకర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి డీసీపీగా నియమితులైన కరుణాకర్.. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాక బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఆయనకు పూలమొక్క అందజేశారు.

సాఫీగా తాగునీటి సరఫరా



శాత్రజ్‌పల్లికి ట్రాక్టర్‌పై వెళ్తున్న డీపీవో

ముత్తారం/కాల్వశ్రీరాంపూర్: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని డీపీవో వీరబుచ్చయ్య తెలిపారు. ముత్తారం మండలం మైదంబండ, పారుపల్లి, శాత్రజ్‌పల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట, ఇదులాపూర్‌లో నీటివనరులను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేసవిలో నీటి కొరత ఉంటుందని, దీనిని అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. పారిశుధ్యం, ఆస్తిపన్ను వసూలు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

పల్లెల్లో పారిశుధ్య పనులు



పెద్దకల్వలలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్/మంథని: వివిధ గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఈనెల 14వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించడంతో జిల్లావ్యాప్తంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్దకల్వల గ్రామంలో చేపట్టిన పనులను డీఎల్‌పీవో వేణుగోపాల్ పర్యవేక్షించారు. నర్సరీని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి నిశాంత్‌రావు తదితరులు ఉన్నారు.. మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో చేపట్టిన పనులను డీఎల్‌పీవో సతీశ్ కుమార్ పరిశీలించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో కాళిందిని

మంథని: ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించాలని డీఆర్డీవో కాళిందిని సూచించారు. వెలుగు రేఖా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. అనంతరం మహిళా కళాకారుల డప్పు ప్రదర్శనను తిలకించారు. నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అంజని, ఏపీఎం పద్మ, సీఈవో రజిత, న్యాయవాదులు షబానా, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయురాలు బొజ్జ స్వాతి, ఏఎస్ఐ ఎం కవిత, కానిస్టేబుళ్లు స్రవంతి, సంధ్య పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగావకాశాలు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం, కార్పొరేట్ ఆఫీస్, నోయిడా కార్పొరేట్ కార్యాలయంలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఉన్నతాధికారులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. కెమికల్ విభాగంలో–9, మెకానికల్‌లో–6, ఎలక్ట్రికల్‌లో–3, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో –2, మెటీరియల్స్‌లో–3, ఫైనాన్స్ అకౌంట్స్‌లో–1, సివిల్స్‌లో–4, మెడికల్‌లో–5, సేఫ్టీలో–3, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీలో–4 ఖాళీలు ఉన్నాయి. ఏప్రిల్ 10 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు (https://www.rfcl.co.in) వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్ సెకండియర్ పరీక్షలకు బుధవారం 97.8శాతం మంది హాజరయ్యారని నోడల్ అధికారి కల్పన తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. మొత్తం 5,107 మందికి 4,995 మంది పరీక్షకు హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు.

షెడ్లు శిథిలం



కూరగాయల మార్కెట్‌లో అలంకారప్రాయంగా కియాస్కీ షెడ్లు

- నాలుగేళ్ల క్రితం 'కియాస్కీ'ల నిర్మాణం
- వీధివ్యాపారులకు కేటాయించని వైనం
- నిరుపయోగంగా మారిన 37 షెడ్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి వ్యాపారులు(స్ట్రీట్ వెండర్స్) అభివృద్ధి, సంక్షేమం కోసం అధికారులు నాలుగేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా షెడ్లు(కియాస్కీలు) నిర్మించారు. కానీ, వాటిని ఎవరికీ కేటాయించకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. వినియోగానికి ముందే శిథిలావస్థకు చేరాయి. పైకప్పులు ధ్వంసం కావడంతో వర్షాకాలంలో ఉరుస్తోంది. దీంతో చుట్టుపక్కల ఏర్పాటు చేసిన షీట్లు తడిచి పెచ్చులు ఊడుతున్నాయి. షెడ్లకు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. స్ట్రీట్ వెండర్స్‌ను ఆర్థికంగా బలోపేతం చేస్తామనే సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు.

15 ఏళ్ల క్రితమే మార్గదర్శకాలు

వీధి వ్యాపారుల అభివృద్ధి, సంక్షేమం కోసం కియాస్కీ షెడ్ల నిర్మాణానికి 2010లోనే ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. వాటిని అమలు చేయడంలో అప్పటి పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో అవి అమలుకు నోచుకోవడంలేదు. ప్రభుత్వం నుంచి ఒత్తిడి తీవ్రతరం కావడంతో 2019లో వీధి వ్యాపారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిన రామగుండం బల్దియా అధికారులు.. ఎట్టకేలకు సర్వే చేపట్టారు.



సర్వే చేస్తున్న మెప్మా సిబ్బంది(ఫైల్)

24,497 మంది స్ట్రీట్ వెండర్స్

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24,497 మంది స్ట్రీట్‌వెండర్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 24,355 మంది రూ.10 వేల పీఎం స్వనిధి రుణం పొందారు. ఆ రుణాన్ని తిరిగి చెల్లించిన వారు.. దశలవారీగా మరోసారి పీఎం స్వనిధి రుణాలు తీసుకున్నారు. వీరందరికీ రహదారులపై కాకుండా నిర్దిష్ట స్థలంలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వీలుగా కియాస్కీ షెడ్లు నిర్మించారు. కానీ, వాటిని కేటాయించడంలో ఉన్నతాధికారులు చేతులెత్తేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నాలుగేళ్ల క్రితం 37 షెడ్ల నిర్మాణం

2019 సెప్టెంబర్‌లో రూ.30 లక్షలు వెచ్చించి 50, 2021 జనవరిలో మరో రూ.40 లక్షల వ్యయంతో ఇంకో 50 షెడ్లు నిర్మించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీంతో తొలివిడతలో గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో ఆరు, గౌతమినగర్‌లో ఆరు, గోదావరి నదీతీరంలోని సమ్మక్క – సారలమ్మ జాతర ప్రాంతంలో 10, ఎన్టీపీసీలోని ఎఫ్‌సీఐ ఎక్స్ రోడ్డులో 15 షెడ్లు నిర్మించారు. మిగతావి నిర్మించడానికి అనువైన స్థలం అందుబాటులో లేదనే సాకుతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

నగరంలో మెప్మా సిబ్బంది సర్వే..

షెడ్ల కేటాయింపు కోసం నగరపాలక కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆదేశాలతో మెప్మా ఆర్పీలు, సీవోలు ఇటీవల సర్వే చేపట్టారు. ఎఫ్‌సీఐ ఎక్స్ రోడ్డులోని 15 షెడ్లతోపాటు గౌతమినగర్‌లోని షెడ్ల కేటాయింపులకు ఆసక్తి ఉన్న స్ట్రీట్‌వెండర్స్ నుంచి దరఖాస్తులు స్వీకరించారు. షెడ్లలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంచనాల కోసం ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు బల్దియా కమిషనర్ లేఖ రాశారు. ఇప్పటివరకు ఇటు బల్దియా నుంచి, అటు విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అలంకారప్రాయంగా మారిన కియాస్కీలపై 'సాక్షి' ఆరా తీయడంతో స్పందించిన బల్దియా కమిషనర్.. మరోసారి స్ట్రీట్‌వెండర్స్ కోసం రీ సర్వే చేపట్టాలని బుధవారం ఆదేశించినట్లు సమాచారం.


కియాస్కీల సమాచారం

తొలిదశలో షెడ్లు	50
మంజూరైన నిధులు(రూ.లక్షల్లో)	33
టెండరు నిర్వహణ	డిసెంబరు – 2020
రెండోదశలోని షెడ్లు	50
మంజూరైన నిధులు(రూ.లక్షల్లో)	40
కౌన్సిల్ ఆమోదం తెలిపింది	జనవరి – 2021
ఇప్పటివరకు నిర్మించిన షెడ్లు	37
గుర్తించిన వీధివ్యాపారులు	24,497

చర్యలు తీసుకుంటున్నాం



కియాస్కీ షెడ్ల కేటాయింపులపై ఇప్పటికే సర్వే చేశాం. మరోసారి సర్వే చేయిస్తాం. షెడ్ల సమీపంలోని స్ట్రీట్‌వెండర్స్‌కే వాటిని కేటాయిస్తాం. షెడ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఎస్టిమేషన్ ఇవ్వాలని కోరుతూ లేఖ కూడా రాశాం. ఈ విషయంపై మరోసారి అధికారులతో చర్చిస్తాం.
– అరుణశ్రీ, బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ), రామగుండం



కిడ్నీలు పదిలమేనా?

కిడ్నీ.. మానవ శరీరంలో అతిముఖ్యమైన అవయవం. తినే తిండి, తాగే నీటిని వడకట్టి వడబోసి.. శరీరానికి అవసరమైన శక్తిని రక్తంలోకి, మలినాలను, వ్యర్థాలను మలమూత్రవిసర్జన ద్వారా బయటికి పంపించే ప్రక్రియను కిడ్నీ నిర్వహిస్తుంది. ఇటీవలకాలంలో జిల్లాలో కిడ్నీవ్యాధి బాధితులు పెరుగుతున్నారు. పిల్లలు, యువతను సైతం సమస్య వెంటాడుతోంది. అనేక మందికి ముందస్తు లక్షణాలు లేకపోవడం, మధుమేహం లేకపోయినా మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోవడం కనిపిస్తోంది. దశాబ్దకాలంలో వేలాదిమంది మరణాలకు కారణమైన వ్యాధికి ప్రధాన కారణాలు మధుమేహం, అధిక రక్తపోటు కాగా పెయిన్ కిల్లర్స్ అధిక వినియోగం, డీహైడ్రేషన్ మరింత ప్రమాదంలోకి నెడుతున్నాయి. నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కథనం.

– 8లో...



పబ్బతి విజయేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పబ్బతి విజయేందర్‌రెడ్డి(55) వ్యవసాయం చేస్తుంటాడు. ఒకరోజు అనూహ్యంగా వాంతులయ్యాయి. కాళ్లు వాపులు వచ్చాయి. వెంటనే కరీంనగర్ వెళ్లగా రక్త పరీక్షలు చేసిన డాక్టర్లు కిడ్నీలు ఫెయిలయ్యాయని నిర్ధారించారు. విజయేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని తెలిపారు. వారానికి రెండుసార్లు డయాలసిస్ చేశారు. ప్రతిసారీ రూ.5000 చొప్పున నెలకు రూ.40వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చులయ్యాయి. విజయేందర్‌రెడ్డిని ఆస్పత్రిలో అచేతన స్థితిలో చూసిన తమ్ముడు జితేందర్‌రెడ్డి(51) తన రెండు కిడ్నీల్లోని ఒక్కటి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. ఆపరేషన్ సక్సెస్ అయింది. విజయేందర్‌రెడ్డికి జితేందర్‌రెడ్డి కిడ్నీ మ్యాచ్ అయింది. అదిపని చేయడం ప్రారంభించింది. మృత్యుముంగిట అసహాయంగా చేతులు కట్టుకుని నిల్చున్న అన్నయ్యకు ఆత్మీయ రక్తబంధం పునర్జన్మనిచ్చింది.

దివ్యాంగులకు యూడీఐడీ నంబర్లు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు

పెద్దపల్లిరూరల్: ప్రతీ దివ్యాంగుడికి యూడీఐడీ నంబరు కేటాయించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం యూనిక్ డిసెబిలిటీ ఐడీ జారీ, స్కూల్ యూనిఫాంపై అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఆయన సమీక్షించారు. యూడీఐడీ నంబర్ల కోసం సదరం శిబిరాలకు పరిమితమైన స్లాట్‌లతో ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులు యూనిక్ డిసిబులిటీ ఐడీ కార్డులు అందిస్తారని అన్నారు. వీటిపై దివ్యాంగులకు అవగాహన కల్పించాలని సంక్షేమశాఖ అధికారిని ఆదేశించారు. యూనిఫాం కుట్టే పనులను మహిళా సంఘాల సభ్యుల్లో టైలర్లుగా ఉన్న వారికే అప్పగించాలన్నారు. డీఆర్డీవో కాళిందిని, సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి వేణుగోపాల్, సూపరింటెండెంట్ శ్రీధర్, అడిషనల్ డీఆర్డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఎల్‌ఆర్‌ఎస్ రుసుం వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ఈనెల 31వ తేదీలోగా ఫీజు చెల్లించేవారికి 25శాతం రాయితీ వర్తిస్తుందనే సమాచారంపై సమగ్ర అవగాహన కల్పించాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, జెడ్పీ హైస్కూల్, ఎంపీడీవో ఆఫీసు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో 1,036 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆమోదించామని, ఈనెలాఖరులోగా వారందరూ రుసుం చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని అదనపు గదుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, ఎంఈవో రాజయ్య, హెడ్మాస్టర్ శారద, ఆర్ఎంవో మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న ఎండలు

- 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదు



జ్యోతినగర్(రామగుండం): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. మార్చి రెండోవారంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం గరిష్ఠంగా 40.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఎండల తీవ్రతకు ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇళ్లలోనూ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లిలో పగటిపూట గరిష్ఠంగా 40.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠంగా 28.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వారం రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీల సెల్సియస్‌లో)

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
06	34.4	19.6
07	34.8	13.6
08	36.0	14.2
09	37.0	15.3
10	34.4	18.6
11	33.6	20.6
12	40.3	28.9

ప్రమాదాల వారధి

- పట్టించుకునే వారేరి?
- ఇప్పటికే నలుగురి మృతి

జ్యోతినగర్(రామగుండం): సింగరేణి సంస్థ మేడిపల్లి ఓపెన్‌కాస్టు గతంలోనే మూతపడింది. దీంతో మేడిపల్లి – మల్కాపూర్ మధ్య గల రోడ్డు మరమ్మతులు విస్మరించారు. రహదారి శిథిలం కావడం, నిత్యం వాహనాల రాకపోకలు అధికం కావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా, దీనిగురించి పట్టించుకున్న నాథుడే లేకుండాపోయాడని స్థానికులు వాపోతున్నారు.

మల్కాపూర్ – రాజీవ్ రహదారి మధ్య రోడ్డు..

రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రాజీవ్ రహదారి నుంచి గ్రామం వరకు ఇటీవల రోడ్డు నిర్మించారు. కానీ, గోదావరినది వైపు వెళ్లే ఓపెన్‌కాస్టు రోడ్డును అలాగే వదిలేశారు. ఓపెన్‌కాస్టులో బొగ్గు తవ్వకాలు జరిగినప్పుడు సింగరేణి కార్మికులు ఈ మార్గంలోనే విధులకు వెళ్లివచ్చేవారు. ప్రస్తుతం రోడ్డు శిథిలమై, గుంతలు పడి ప్రయాణానికి నరకం చూపుతోంది. రాత్రివేళ అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వరద కాలువపై ఉన్న వంతెనకు ఇరువైపులా గోడలు లేవు. వాహనాలు కాలువలో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు సంవత్సరాల్లో కాలువలో పడి ముగ్గురు మృతి చెందారు. సోమవారం రాత్రి కూడా మల్కాపూర్ గ్రామానికి చెందిన మానాల వెంకటేశం వాహనంతో కాలువలో పడి చనిపోయాడు.



ప్రమాదకరంగా ఉన్న వంతెన

రోడ్డంతా గుంతలమయం

మేడిపల్లి ఓపెన్ కాస్టు – మల్లాపూర్ మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. రెండు సంవత్సరాల క్రితం గోదావరి నది బ్యాక్ వాటర్ రావడంతో కాలువపై నిర్మించిన బ్రిడ్జి కూలిపోయింది. అధికారులు తాత్కాలికంగా మట్టిపోసి రాకపోకలు సాగేలా ఏర్పాట్లు చేశారు. కానినీ, దానికి వరదకాలువ వైపు గోడలేక రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి వరదకాలువలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

బ్రిడ్జి, రోడ్డు నిర్మించండి



మల్కాపూర్ నుంచి ఓపెన్‌కాస్టు వైపు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. సింగరేణి ఓపెన్ కాస్టు ఉన్నప్పుడు రోడ్డు బాగుండేది. ఎన్టీపీసీ వరదకాలువలో నీరు పారడంతోపాటు గతంలో గోదావరి నది బ్యాక్ వాటర్‌తో బ్రిడ్జి కూలింది. బ్రిడ్జి మళ్లీ నిర్మించలేదు. రైతులు, వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. పాలకులు స్పందించాలి.
– మద్ది విజయ్‌కుమార్, మల్కాపూర్

పాలకులదే నిర్లక్ష్యం



గత పాలకుల నిర్లక్ష్యంతోనే బ్రిడ్జి కూలిపోయింది. మళ్లీ నిర్మించకపోవడం, బ్యాక్ వాటర్‌ను కంట్రోల్ చేయకపోవడం, గోదావరి నది వరదకు కరకట్ట కట్టకపోవడంతోనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లి సింగరేణి, ఎన్టీపీసీల సీఎస్సార్ నిధులతో రోడ్డు, బ్రిడ్జి నిర్మించాలి. సమస్య పరిష్కరించాలి.
– మొహమ్మద్ రహీమ్, మల్కాపూర్

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



మల్కాపూర్ రోడ్డు, కల్వర్టు మరమ్మతుల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసకెళ్తాం. ప్రమాదాలు జరగకుండా అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం. ఎన్టీపీసీ వరద, సింగరేణి రోడ్డు కావడంతో ఆయా పరిశ్రమల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– అరుణశ్రీ, బల్దియా కమిషనర్, రామగుండం

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. కమిషనరేట్‌లో బుధవారం బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు స్థానిక పరిస్థితుల గురించి పైఅధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన సిబ్బంది, అధికారులను గుర్తించి రివార్డులు అందజేస్తామన్నారు. ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలని, అనుక్షణం వారికి అందుబాటులో ఉండాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, ప్రతాప్, బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ వర్టికల్స్ ఇన్‌చార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.



బుధవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న సీపీ

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

సీపీ అంబర్‌కిషోర్‌ఝా బుధవారం అర్ధరాత్రి గోదావరిఖనిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ పరిధిలోని ఆర్జీ–1 సీహెచ్‌పీ, రైల్వే కోల్ లోడింగ్ ఏరియా తనిఖీ చేసి, సెక్యూరిటీగార్డులు, రైల్వే సిబ్బందితో మాట్లాడారు. తిలక్‌నగర్‌నగర్ డౌన్‌లో నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు జరిపారు. సీపీ వెంట డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమే శ్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ ఉన్నారు.

నియామకం



సుధాకర్

ధర్మారం(ధర్మపురి): ధర్మపురి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ డైరెక్టర్‌గా ధర్మారం మండల కేంద్రానికి చెందిన అవ్వ సుధాకర్‌ను నియమించారు. ఈమేరకు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. తనను నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

కాంట్రాక్టు పద్ధతితో సీనియర్లకు అన్యాయం

- సింగరేణి అధికారుల సంఘం నిరసన
- జీఎంలకు వినతిపత్రాలు అందజేత

గోదావరిఖని: సింగరేణి చీఫ్ సెక్యూరిటీ అధికారి, చీఫ్ మెడికల్ సర్వీసెస్ అధికారులను కాంట్రాక్టు పద్ధతిన నియమించడం సరికాదని అధికారుల సంఘం నాయకులు అన్నారు. ఆర్జీ–1, 2 జీఎంలు లలిత్‌కుమార్, వెంకటయ్యకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఆ తర్వాత నిరసన వ్యక్తం చేశారు. కొత్త విధానంతో సీనియర్ అధికారులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంస్థలో డిపార్ట్‌మెంట్ హెడ్‌లుగా సర్వీస్‌లో లేనిబయటి వ్యక్తులను నియమించడం సరైంది కాదన్నారు. కష్ట, క్లిష్ట సమయాల్లో సమ్మె సంస్కృతిని పని సంస్కృతిగా మార్చడంలో అధికారుల కృషి ఉందని గుర్తుచేశారు. అనేక వ్యయప్రయాసలకోర్చి, ప్రాణాలకు తెగించి, చిత్తశుద్ధితో అధికారులు పనిచేస్తున్నారన్నారు. కరోనా మహమ్మారితో పోరాడే సమయంలోనే అద్భుత పనితీరు కనబర్చి ఉద్యోగుల్లో మనోధైర్యం కల్పించారని పేర్కొన్నారు. ఈక్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన చెందారు. 30ఏళ్లకు పైబడిన అనుభవం, జవాబుదారీతనంతో పనిచేస్తున్న వారిని కాదని కొత్తపద్ధతిన బయటివారిని నియమించే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. దీనిద్వారా భవిష్యత్‌లో సంస్థపై పడే దుష్ఫలితాలను దృష్టిలో ఉంచుకుని కొత్త పద్ధతిన నియామకాల ఆలోచనను ఉపసంహరించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సింగరేణి అధికారుల సంఘం సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పోనుగోటి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ కిరణ్‌రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు చిలుక శ్రీనివాస్, బి.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. ఆర్జీ–2 ఏరియాలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంవోఏఐ అధ్యక్షుడు పెద్ది నర్సింహులు, నాయకులు ఎస్.మధుసూదన్, చంద్రశేఖర్, నరేశ్, జనార్దన్, సుగుణాకర్, రామకృష్ణ, నితిన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సీఎంవోఏఐ నాయకులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సయ్యద్ సర్వర్ పాష(ఫైల్)

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో ఈనెల పదో తేదీన కారు ఢీకొట్టిన ఘటనలో గాయపడిన సయ్యద్ సర్వర్ పాష (55) చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతిచెందాడు. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. సయ్యద్ సర్వర్ పాష, సయ్యద్ జాకీర్ పాష అన్నదమ్ములు. ఈనెల 10న రాత్రి సమయంలో నమాజ్ చేసేందుకు మసీదుకు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో పంగ రాజయ్య మద్యం సేవించి అతివేగంతో కారు నడుపుతూ వచ్చి వీరిని వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వీరిని కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సయ్యద్ సర్వర్ పాష మృతి చెందాడు. జాకీర్ పాష పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. సయ్యద్ సర్వర్ పాషకు ముగ్గురు కూమారులు సంతానం. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మెట్‌పల్లిలో ఒకరు..

మెట్‌పల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకన్న(60) గత నెల 25న ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మల్లాపూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వెంకన్న ద్విచక్రవాహానాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకన్నను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అంజయ్య ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కరీంనగర్‌లో కారు ఢీకొని..

కరీంనగర్‌క్రైం: నగరంలోని సిరిసిల్ల బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం నగరంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన వాల యాదగిరిరావు (57) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన బైక్‌పై సిరిసిల్ల బైపాస్ నుంచి రాంనగర్ వైపునకు వెళ్తున్న క్రమంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. రోడ్డుపైన పార్కింగ్ చేసిన లారీకి యాదగిరిరావు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లకు బదిలీలు, పదోన్నతి కల్పిస్తూ బుధవారం బస్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్–2 డిపో మేనేజర్ వి.మల్లయ్యకు ఖమ్మం డిప్యూటీ ఆర్‌ఎంగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్–2డిపో మేనేజర్‌గా బోధన్ డీఎం ఎం.శ్రీనివాసులును బదిలీ చేశారు. కరీంనగర్ డిప్యూటీ ఆర్‌ఎంగా బీవీ.రావు, జగిత్యాల డీఎంగా జి.సునీత, హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లు కుషాయిగూడకు, దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ వెంకన్నను హుస్నాబాద్‌కు బదిలీ చేశారు.

నేడు అనభేరి వర్ధంతి

కరీంనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాం గుండెల్లో రణభేరి మోగించిన అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతిని బుధవారం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. జిల్లాకేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద గల అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం వద్ద, మహ్మదాపూర్‌లో నిర్వహించే వేడుకల్లో సీపీఐ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నమో నారసింహాయా..



గోదావరిలో భక్తుల స్నానాలు



ఆలయంలో భక్తుల రద్దీ



పందిరి కింద సేదతీరుతున్న భక్తులు



క్యూలైన్‌లో బారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. సరిపడా నీడ సౌకర్యం లేక అల్లాడారు. ఎండకు తాళలేక చీరలతోనే తాత్కాలిక గుడిసెలు వేసుకున్నారు.

కిడ్నీలు పదిలమేనా?

- విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ వాడకం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ పేషెంట్లు
- నామమాత్రపు చికిత్సలే
- జీవనశైలీలో మార్పులు అవసరమంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం



గోదావరిఖని జీజీహెచ్‌లోని డయాలసిస్ కేంద్రం

కరీంనగర్‌టౌన్/కోల్‌సిటీ(రామగుండం)/సిరిసిల్ల: కిడ్నీలు ప్రతిరోజు దేహంలో 200 లీటర్ల రక్తాన్ని శుభ్రం చేస్తూ, యూరియా, క్రియాటినిన్ లాంటి జీవరసాయనాలను వడపోస్తాయి. కిడ్నీల పనితీరు దాదాపు 70 నుండి 80 శాతానికి పడిపోయే వరకు బాధితులకు ఆ విషయమే తెలియదు. ఒకసారి కిడ్నీలు గనక చెడిపోతే, జీవక్రియల్లో వెలువడే ఎన్నో విషరసాయనాలు దేహంలోనే పేరుకుపోవడం మొదలవుతుంది. దీంతో ప్రాణాలకే ముప్పు తెచ్చి పెడుతుంది. అవగాహన లేమి, నిర్లక్ష్యం, విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ మందులు వాడకంతో ఉమ్మడి జిల్లాలో జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. మూత్రపిండాలు ఒకసారి దెబ్బతింటే తిరిగి బాగు చేయటం సాధ్యం కాదు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పాడవకుండా చూసుకోవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. గురువారం 'ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం' సందర్భంగా కథనం.

ఇదీ నేపథ్యం

2006లో తొలిసారిగా మార్చి 14న ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని ప్రారంభించారు. ఏటా ప్రత్యేక థీమ్ను ప్రకటించి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మూత్రపిండాల ఆరోగ్యం, డయాలసిస్ అవగాహన కోసం ఏటా మార్చి రెండవ గురువారం ×ప్రపంచ కిడ్నీ దినోత్సవ్ంగా నిర్వహిస్తున్నారు. ×మీ మూత్రపిండాలు బాగున్నాయా? ముందుగానే గుర్తించండి.., మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడండి..₹ అనేది ఈ ఏడాది నినాదం. కిడ్నీ వ్యాధికి సంబంధించిన ప్రమాద కారకాలు మధుమేహం(షుగర్), రక్తపోటు(బీపీ) కుటుంబంలో మూత్రపిండాల వ్యాధి చరిత్ర ఉండడమని వైద్యులు పేర్కొంటున్నారు.

కిడ్నీల పనితీరు కీలకం

మూత్రపిండాలు మూత్రం తయారీతోపాటు రక్తం వడపోతలో కీలకంగా పనిచేస్తాయి. కణాలు ఉత్పత్తి చేసే ఆమ్లాలను (యాసిడ్)ను బయటకు పంపిస్తాయి. రక్తంలో నీరు, లవణాలు, సోడియం, కాల్షియం, భాస్వరం, పోటాషియం వంటివి సమతుల్యంగా ఉండేలా చేస్తాయి. కిడ్నీలు దెబ్బతింటే ప్రాణాలు కోల్పేయే ప్రమాదం ఉంది. సీరం క్రియాటిన్ పరీక్ష ద్వారా కిడ్నీ పనితీరును తెలుసుకునే వీలుంది. ఏడాదికోసారైనా ఈ పరీక్ష చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రక్తపోటు, మధుమేహం, అధిక బరువు వంటివి తలెత్తకుండా చూసుకోవాలి. ధూమపానం, మద్యపానం మానుకోవాలి. పుష్కలంగా నీరు తాగాలి, వ్యాయామం చేయాలి. ఉప్పు తక్కువ తీసుకోవాలి. అధికంగా మాంసం తీసుకోవద్దు. ఆహారంలో సగభాగం పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. నొప్పి గోళీలు, అనవసరంగా స్టెరాయిడ్స్ వాడకూడదు.

- ఉమ్మడి జిల్లాలో మూత్రపిండ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యరంగంలో కిడ్నీ బాధితులకు నామమాత్రపు వైద్య సేవలు అందుతున్నాయి. స్థానికంగా ప్రైవేటు రంగంలో నెఫ్రాలజిస్టులు ఉన్నప్పటికీ సదుపాయాల కొరతతో రోగులు పెద్ద నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వ వైద్యశాలల్లో నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలు లేవు. చికిత్స మాత్రమే అందిస్తున్నారు.
- గోదావరిఖని జీజీహెచ్‌తోపాటు పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి, మంథని ప్రభుత్వాస్పత్రుల్లో ఐదు మిషన్లు చొప్పున మూడు డయాలసిస్ కేంద్రాలున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద జీజీహెచ్‌లో రోజుకు 16 మందికి నాలుగు షిఫ్టుల ద్వారా నెలలో 40మందికి, పెద్దపల్లిలో రోజుకు 15 మందికి మూడు షిఫ్టుల చొప్పున నెలకు 33 మంది పేషెంట్లకు, మంథనిలో రోజుకు తొమ్మిది మందికి ఒక షిఫ్టులో నెలలో 9మంది పేషెంట్లకు డయాలసిస్ చేస్తున్నారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 95మంది కిడ్నీలు (మూత్రపిండాలు) ఫెయిల్ అయి డయాలసిస్‌పై జీవిస్తున్నారు. వందలాది మంది సకాలంలో వైద్యం అందక, కిడ్నీ అందించే రక్తసంబంధీకులు ఎవరూ ముందుకు రాక.. ప్రాణాలు కోల్పోయారు.
- కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు నగర శివారులో ఉన్న రెండు వైద్యకళాశాలల్లో సైతం డయాలసిస్ సేవలు ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్నారు.

పెయిన్ కిల్లర్స్ తీసుకోవద్దు



ఈ మధ్య చాలా మంది పేయిన్ కిల్లర్స్, ఇతర హానికరమైన మందులను విచ్చలవిడిగా మింగుతున్నారు. డాక్టర్ సలహా లేకుండా ఎలాంటి మందులను వాడకూడదు. నాటు వైద్యం జోలికి వెళ్ల కూడదు. జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్య రుగ్మతలు కిడ్నీ వ్యాధులకు కారణం. సంపూర్ణ ఆరోగ్యం కోసం మన జీవనశైలిని మార్చుకోవాలి.

– కుందరాపు గోపికాంత్, యూరాలజిస్టు, గోదావరిఖని

లక్షణాలు తెలియడం లేదు



చాలా మంది వ్యాధి ముదిరే వరకు లక్షణాలు తెలియపోవడం వల్ల పరిస్థితి విషమించిన తర్వాత వైద్యం కోసం వస్తున్నారు. తగ్గని జ్వరం, కాళ్లు, ముఖం వాపులు, యూరిన్‌లో ప్రొటీన్లు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అశ్రద్ధ చేయడం వల్ల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడవచ్చు.

– రాంచందర్ తొర్రెం, నెఫ్రాలజిస్టు

భార్య చేతిలో భర్త హతం



తాళ్ల రాజన్న మృతదేహం

కోరుట్ల: మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో తాళ్ల రాజన్న(55)ను అతని భార్య లక్ష్మీ హత్య చేసింది. మద్యానికి బానిసైన రాజన్న కొంతకాలంగా భార్యను వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కూడా మద్యం తాగివచ్చి గొడవపడ్డాడు. దీంతో సుమారు రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె గొడ్డలితో అతనిపై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై శ్యాంరాజ్ పరిశీలించారు.

గ్రామపంచాయతీలో కల్లు తాగిన యువకుడు



టేబుల్‌పై కల్లు బాటిల్, గ్లాసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామపంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి ఏకంగా కార్యాలయంలో కల్లు తాగి, దూమపానం చేసిన యువకుడి వీడియో బుధవారం సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టింది. తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ఒక యువకుడు తాళం పగులగొట్టి పంచాయతీ కార్యదర్శి కార్యాలయంలోకి ప్రవేశించాడు. దర్జాగా కార్యదర్శి టేబుల్‌పై కాళ్లు చాపుకుని, అదే టేబుల్‌పై కల్లు బాటిల్, గ్లాసు పెట్టుకుని సేవించాడు. ఈ తతంగాన్ని అంతా మరో యువకుడు వీడియో తీయడంతో వెలుగుచూసింది. కాగా సదురు యువకుడిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి బుధవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- 79.50క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

గోదావరిఖని: మంథని నుంచి మహారాష్ట్రకు పీడీఎస్ రైస్‌తో తరలివెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫైవింక్లయిన్ వద్ద వ్యాన్‌ను పట్టుకుని రైస్ తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. డీసీఎం వ్యాన్‌లో ఉన్న 79.50 బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులు మంథని శ్రీపాదకాలనీకి చెందిన దేశెట్టి మారుతిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.3.08లక్షలు ఉంటుందన్నారు. మరో ముగ్గురు నిందితులు మంథనికి చెందిన రాచర్ల రమేశ్, సిరొంచకు చెందిన యెల్లంకి వీరస్, మంథనికి చెందిన ఓదెల మహేందర్ పరారీలో ఉన్నారని అన్నారు. తదుపరి విచారణ కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు.

విదేశాలకు పంపిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన జైశెట్టి రాకేశ్‌ను విదేశాలకు పంపిస్తామని మోసం చేసిన అల్లెపు వెంకటేశంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. రాకేశ్‌ను విదేశాలకు పంపిస్తానని మాయమాటలు చెప్పి 2022లో రూ.3 లక్షలు, రూ.50 వేలు ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. 2023 ఆగస్టులో అర్మీనియా దేశం పంపించగా.. అక్కడ రాకేశ్‌కు ఉద్యోగం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మోసపోయానని తెలుసుకుని తిరిగి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఏజెంట్ వెంకటేశం మళ్లీ మాయమాటలు చెప్పి జనవరి 12న థాయిలాండ్ దేశానికి పంపించాడు. అక్కడి నుంచి బ్యాంకాక్‌కు తీసుకెళ్లి సరైన ఉద్యోగం చూపించకుండా సైబర్‌క్రైమ్ ముఠాకు అప్పగించాడు. వారు సైబర్ నేరాలు చేయాలని రాకేశ్‌పై ఒత్తిడి పెంచడంతో ఆయన తిరిగి స్వయం వచ్చాడు. మాయమాటలు చెప్పి మోసానికి పాల్పడిన అల్లెపు వెంకటేశంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కోరుట్లలో పట్టపగలే దొంగతనం

- రూ.4 లక్షలు, రెండున్నర తులాల బంగారం చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోరుట్ల: పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో బుధవారం పట్టపగలే దొంగలు తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన ఐలారం పద్మ బట్టల దుకాణం నడుపుతోంది. కూతురు ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్లగా.. పద్మ ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లింది. పద్మ కూతురు పరీక్ష రాసి ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా తాళాలు కూడా పగులగొట్టి, వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. వెంటనే తల్లి పద్మకు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి బీరువాలోని రూ.4 లక్షలు, రెండున్నర తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై రాంచంద్రం గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

పరీక్ష కేంద్రంలో విద్యార్థినిపై పడిన ఫ్యాన్



కరీంనగర్ కాశ్మీర్‌గడ్డలోని ఓ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాస్తుండగా శివాన్విత అనే విద్యార్థిని తలపై సీలింగ్ ఫ్యాన్ ఊడి పడింది. కన్ను, ముక్కుకుపై గాయాలయ్యాయి. పరీక్ష కేంద్రంలో ఉన్న ఏఎన్‌ఎంలు ప్రథమ చికిత్స చేశారు. పరీక్ష సమయం వృథాకావడంతో విద్యార్థినికి మరో 30నిమిషాలు అదనంగా సమయం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సీపీ గౌస్ ఆలం వచ్చి విద్యార్థినిని పరామర్శించారు. ఈ ఘటనపై కేంద్రం ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

కామదహనం



వేములవాడ: రాజన్న సన్నిధిలో బుధవారం రాత్రి కామదహనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ మహాద్వారం వద్ద ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

హలో..1912

- టీజీఎన్పీడీసీఎల్‌లో ఎమర్జెన్సీ రీస్టోర్ టీం
- అంబులెన్స్ తరహాలో విద్యుత్ నిలిచిన లొకేషన్‌కు..
- ఆరుగురు సభ్యుల బృందంతో విద్యుత్ పునరుద్ధరణ పనులు



ఆరుగురు సభ్యులతో కూడిన ఎమర్జెన్సీ రీస్టోర్ టీం, మొబైల్ వాహనాలు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, తక్షణ సేవలందించాలనే లక్ష్యంతో టీజీఎన్పీడీసీఎల్ కొత్త సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి చేర్చేందుకు వినియోగిస్తున్న అంబులెన్స్‌ల మాదిరిగా విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు సంస్థ మొబైల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా సంస్థ కార్యాచరణ రూపొందింది. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వినియోగదారుడు 1912కు సమాచారం ఇస్తే.. ఆ వాహనం లొకేషన్‌కు చేరుకొని మరమ్మతులు చేపడుతుంది. ఈ సేవలను కరీంనగర్ సర్కిల్‌లో అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

తక్షణ పరిష్కారానికి ఎమర్జెన్సీ టీం

ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక సమస్యలు, బ్రేక్ డౌన్ వంటి విద్యుత్ అంతరాయాలు ఏర్పడినప్పుడు విద్యుత్ సంబంధిత సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు ఎమర్జెన్సీ రిస్టోర్ టీం పనిచేయనుంది. ఈ మొబైల్ వాహనంలో విద్యుత్ మెటీరియల్‌తో పాటు థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సూలేటర్లు, కండక్టర్లు, కేబుల్స్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు



వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్‌ను అందించేందుకు సంస్థ అనేక ప్రణాళికలు ప్రవేశపెడుతోంది. అంబులెన్స్‌ల మాదిరిగానే విద్యుత్ సంస్థ మొబైల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో ఆరుగురు సభ్యులతో ఎమర్జెన్సీ రిస్టోర్ టీంను ఏర్పాటు చేసింది. 24/7 అందుబాటులో ఉండే ఈ సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలి. విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే 1912కు ఫోన్ చేస్తే సమస్యను త్వరితగతిన పరిష్కరిచేందుకు చర్యలు తీసుకుంటాం.

– మేక రమేశ్‌బాబు, ఎస్ఈ, కరీంనగర్

ఆన్‌లైన్ పెట్టుబడిదారుడి ఇంటి ఎదుట ఆందోళ



పెట్టుబడిదారుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

జగిత్యాలక్రైం: జగిత్యాలలో ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టించి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి ఇంటిముందు బాధితులు బుధవారం ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కొడిమ్యాలకు చెందిన కొంతమంది నుంచి సుమారు రూ.70 లక్షల వరకు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టించాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ పెట్టుబడి వ్యాపారం మూతపడటంతో తమకు తమ డబ్బులు చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. వారికి పొంతనలేని సమాధానాలు చెబుతూ వచ్చిన సదరు వ్యక్తి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితులు ఆయన ఇంటి ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటనస్థలానికి వచ్చి బాధితులతో మాట్లాడి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అదే సమయంలో పెట్టుబడి పెట్టించిన సదరు వ్యక్తి రావడంతో బాధితులు అతడితో వాగ్వాదానికి దిగారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



గాయపడ్డ శ్రీనివాస్‌గౌడ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ బుధవారం తాటిచెట్టు పైనుండి కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథ నం ప్రకారం.. శ్రీనివాస్ గౌడ్ వృత్తిలో భాగంగా తాటికల్లు గీస్తుంటాడు. ఎప్పటిలాగే చెట్టు ఎక్కుతుండగా మోకు తెగిపోవడంతో చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు.